క్లుప్తంగా

భీమారంలో వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న మెడికల్ ఆఫీసర్ ప్రసాద్

భీమారం: జ్వరాల సీజన్ నేపథ్యంలో మండల కేంద్రంలో పద్మశాలి వీధిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. జైపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రసాద్ 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేశారు. వర్షాకాలంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కృష్ణమూర్తి, ఎన్ఎన్ఎంలు పాల్గొన్నారు.

మందమర్రి తహసీల్దార్ బదిలీ

మందమర్రిరూరల్: మందమర్రి తహసీల్దార్ కె.చంద్రశేఖర్‌ను సీఈవో సెర్ప్ (హైదరాబాద్)కు బదిలీ అయ్యారు. మంచిర్యాల కలెక్టర్ ఆఫీస్‌లో సూపరింటెండెంట్ (ఈ)గా విధులు నిర్వహిస్తున్న పి.సతీశ్‌కుమార్‌ను మందమర్రి తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ కుమార్‌దీపక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ముందు బదిలీల్లో భాగంగా చంద్రశేఖర్ మందమర్రి తహసీల్దార్‌గా వచ్చారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

దండేపల్లి: దండేపల్లి, పాతమామిడిపల్లి, కొర్విచెల్మ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు రఘునాథ్ వెర్రబెలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ గురువారం స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు గురువయ్య, సురేందర్, శ్రీనివాస్, వంశీ, సంతోష్, మహేష్, రవీందర్, వెంకటేశ్వర్లు, అశోక్, అనిల్, యుగేందర్ పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుకు గురువారం తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు బురదమయమై వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. శ్రావణమాసంలో ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆలయ చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి సిబ్బందితో ట్రాక్టర్ సహాయంతో బురదను తొలగింపజేసి, గుంతలు పూడ్చివేయించారు. సిబ్బంది భాను ఉన్నారు.

కేకే-5 గని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ సబ్‌కమిటీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా నాగేశ్వర్ నాయక్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా రాజేశం, వైస్ ప్రెసిడెంట్‌గా విక్రంసింగ్, ఏ రిలే సాయి కృష్ణ, బీ రిలే నుంచి ఆశిష్, సీ రిలే నుంచి రెడ్డిరాజుల అజయ్, బీ రిలే నుంచి ప్రశాంత్, శ్రీకాంత్, సలహాదారులుగా సాంబయ్య, శివకృష్ణ, సమ్మయ్య, రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రావు, గోపతి సత్యనారాయణ, దేవసాని సాంబయ్య, సంపత్ ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: దొంగతనం ఆరోపణలతో దళిత మహిళను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి దాడి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రాజేంద్రప్రసాద్, కిరణ్, రవీందర్, తిరుపతి, గద్దల రమేశ్ గంగయ్య పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడులు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి శివారులో పేకాటస్థావరంపై ముందస్తు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 7 గురిని పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజుకుమార్ తెలిపారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.18,620 నగదుతోపాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి విచారణ నిమిత్తం కోటపల్లి ఎస్సై రాజేందర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సైలు ఉపేందర్, లచ్చన్న పాల్గొన్నారు.

'అమ్మ-ఆదర్శ' పనులపై విచారణ చేపట్టాలి

మందమర్రిరూరల్: మండలంలోని అమ్మ-ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులపై విచారణ చేపట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నితీశ్ డిమాండ్ చేశారు. ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి గురువారం వినతిపత్రం అందజేశారు. అమ్మ ఆదర్శ పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. విచారణ పూర్తయిన తర్వాత బిల్లులు చెల్లించాలన్నారు.

రోడ్లపై పశువులు

- గుంపులు, గుంపులుగా సంచారం
- అదుపు తప్పుతున్న బైక్‌లు
- ప్రమాదాల్లో గాయపడుతున్న వాహనదారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని జాతీయ రహదారిపై ఎక్కడపడితే అక్కడ పశువులు తిష్టవేస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా పడుకుంటూ.. అటు ఇటు నడుస్తూ గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. డివైడర్లకు ఇరువైపులా పగలు, రాత్రి తిరుగుతున్నాయి. దీంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లకు వాహనదారుల ఇదే సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాల వరకు, ఐబీ చౌరస్తా నుంచి పాత మంచిర్యాల వరకు, బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఏసీసీ వరకు, రామకృష్ణపూర్, మందమర్రి, చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి పరిధిలో కొన్నిరోజులుగా ఎక్కడ పడితే అక్కడ రహదారిపై పశువులు పడుకుంటున్నాయి. జాతీయ రహదారి గుండా వందలాది వాహనాలు వెళ్తుంటాయి. స్పీడ్‌గా వస్తున్న బైక్‌లు అదుపు తప్పి ద్విచక్రవాహనదారులు గాయపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు రోడ్లపై పశువుల తిష్టతో బైక్, ఆటోలు పక్క నుంచే వెళ్తున్నాయి.

స్పీడ్‌బ్రేకర్ల వద్ద..

ప్రస్తుతం రోడ్ల విస్తరణ, తారురోడ్లు, డివైడర్లు ఏర్పాటు చేశారు. వచ్చే పోయే వాహనాలు వేర్వేరుగా వెళ్తున్నాయి. కొంత వరకు ప్రమాదాలు తగ్గాయి. వాహనాలు స్పీడ్ పెరుగుతున్న సమయంలో స్పీడ్‌బ్రేకర్ల వద్ద ఆవులు, గేదెలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అత్యవసర, పేషంట్లను తీసుకెళ్తున్న అంబులెన్స్‌లు రహదారిపై ఆగాల్సిన పరిస్థితి నెలకొంది.

యజమానులకు జరిమానా విధించాలి

వేసవిలో ఇంటి వద్ద పశువులను కట్టేసి పశుగ్రాసం అందించిన యజమానులు వర్షాకాలంలో వాటిని పట్టించుకోవడం లేదు. పశువుల పాకలు, దొడ్లు చిత్తడిగా అపరిశుభ్రంగా మారుతుండడే ఇందుకు కారణం. దీంతో రోడ్లపైనే తిష్ట వేసిన పశువులు ఇరువైపులా గడ్డి పచ్చికబైళ్లు మేస్తున్నాయి. రోడ్లపై పశువులను బంధించి యజమానులకు అధికారులు జరిమానా విధిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చని వాహనదారులు పేర్కొంటున్నారు.



జాతీయ రహదారిపై ఆవులు

చర్యలు తీసుకోవాలి



రోడ్లపై పగలు, రాత్రి వేళ పశువులు ఉంటున్నాయి. బైక్ మీద నైట్ డ్యూటీకి పోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. చీకట్లో కదలవు, మెదలవు రోడ్డు దిగి వెళ్లాల్సిందే. పశువులను రోడ్లపై రాకుండా చర్యలు తీసుకోవాలి. - **తోట మహేశ్, శ్రీరాంపూర్**

రోడ్లపై ప్రమాదాలు



డివైడర్లకు రెండు వైపులా పశువులు పడుకుంటున్నాయి. స్పీడ్ వస్తున్న వాహనదారులు గమనించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై పశువులను రాకుండా అరికట్టాలి. - **సురేశ్, మంచిర్యాల**

భీమారంలో



జాతీయ రహదారిపై పశువులు

భీమారం: మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారి గల భీమారంలో పశువులు సంచరిస్తున్నాయి. ఎప్పుడు రద్దీగా ఉండే రహదారిపై పశువులు రాత్రిసమయంలో తిష్ట వేస్తున్నాయి. భీమారంలో దాదాపు 3 కి.మీ పొడవు నాలుగు వరుసల రహదారిని అభివృద్ధి చేశారు. రాత్రివేళ సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనిచేయడం లేదు. వేగంగా వెళ్లే లారీలు, బస్సుల డ్రైవర్లు దగ్గరికి వచ్చేవరకు పశువులు పడుకున్నట్లు కనిపించక వాటిని ఢీకొనడంతో మృత్యువాతపడుతున్నాయి. గత మూడేళ్ల క్రితం పోలీసులు రాత్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్లపై పశువులను గుర్తించి వాటికి ఎరుపు రంగు వేశారు. వాటిని రోడ్ల పైకి వదిలితే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇది కొన్ని రోజులు సత్ఫలితాలు ఇచ్చింది.

పశువులను వదిలితే కేసులు



రోడ్డుపై పశువులను వదిలిన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించి పశువులు రాకుండా చూస్తాం.- **రాములు, ఎస్సై భీమారం**

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

కోటపల్లి: పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీపీవో డి.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. కొల్లూర్, పార్‌పల్లి, పిన్నారం పంచాయతీలను గురువారం ఆయన సందర్శించారు. కంపోస్టు షెడ్డు, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు పోషకాహారం అందించే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొల్లూర్‌లో పారిశుధ్య, క్లోరినేషన్ పనులను పరిశీలించారు. పార్‌పల్లిలో ప్లాంటేషన్ నిర్వహణ, ఫీవర్ సర్వే నిర్వహణపై కార్యదర్శి తిరుపతికి సూచనలు చేశారు. ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేసి రిపోర్టు అందించాలని ఆదేశించారు. పిన్నారం పంచాయతీ తనిఖీ సమయంలో కార్యదర్శి మధుకర్ లేకపోవడంతో ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శులు ఉన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో విద్యుత్ అధికారులు గురువారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పంట పొలాలకు వెళ్లి వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏఈ భాస్కర్, జేఎల్ఎం వేణుగోపాల్ వివరించారు. ప్రతి రైతు వ్యవసాయ కనెక్షన్ వద్ద విధిగా కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో విద్యుత్ అధికారులు పొలంబాట నిర్వహించారు. పొలాల్లో ఏడీఈ ప్రభాకర్‌తో కలిసి తిరిగి వంగిన స్తంభాన్ని గుర్తించారు. మరమ్మతు చేపడుతామన్నారు. జేఈ గణేశ్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో 61 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. ఆపరేషన్ సమయంలో రోగి చికిత్సకు అయ్యే ఖర్చును ఎల్‌వోసీ ద్వారా తక్షణం నిధులు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలో అర్హులందరికీ త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, ఇసాక్, లక్ష్మీనారాయణ, కరుణాకర్, ఫసీఉల్లా, రాజన్న, శాఖీర్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ముమ్మరంగా స్వచ్ఛదనం-పచ్చదనం

బెల్లంపల్లి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గురువారం పట్టణంలోని 22 వార్డు పరిధిలోని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. బాలికల ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వైద్యురాలు సౌజన్య అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ అశోక్, మాజీ కౌన్సిలర్ వాసు, రెవెన్యూ అధికారి ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం పాల్గొన్నారు.

చెన్నూర్: పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మున్సిపల్ కమిషనర్ గంగాధర్, హెల్త్ సూపర్‌వైజర్ జగదీశ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధులపై అవగాహన, జ్వరాల పై సర్వే నిర్వహించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, ఏఈ సాయికిరణ్, వైద్య సిబ్బంది, మెప్మా సభ్యురాలు పాల్గొన్నారు.

జన్నారం: ఇంటి పరసరాల్లో నిల్వ నీటిని లేకుండా చూడాలని ఎంపీడీవో శశికళ పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పొనకల్‌లో ఈవో రాహుల్, కలమడుగులో ప్రత్యేక అధికారి బుచ్చన్న అధ్వర్యంలో సీజనల్ జ్వరాలపై ఇంటింటికీ అవగాహన కల్పించారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు.



చెన్నూర్: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్, వైద్య అధికారులు

కాసిపేట: మండల కేంద్రంలోని మోడల్, ముత్యంపల్లి జెడ్పీ పాఠశాలల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగమల్లయ్య, పంచాయతీ ప్రత్యేకాధికారి మల్లేశ్, ఎంఎల్‌హెచ్‌పీ హరీశ్, కార్యదర్శి మేఘన పాల్గొన్నారు. అదేవిధంగా కొండపూర్, కోనూర్, లంబాడితండా(డి), ధర్మరావుపేట, తాటిగూడ గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి గంగారాం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి జాగ్రత్తలు వివరించారు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దండేపల్లి: గ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. కంచరబాయిలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరికాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సింగరేణి విద్యుత్ సరఫరాను అకస్మికంగా నిలిపివేయడం సరికాదని పట్టణ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌తో ఆయన కార్యాలయంలో గురువారం చర్చించారు. కార్మిక కాలనీల్లో ప్రభుత్వ, సింగరేణి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఇళ్లలో సింగరేణి కరెంట్ కనెక్షన్ తీసేయాలని, ప్రభుత్వ కనెక్షన్ లేని క్వార్టర్లు, ఇళ్లకు కరెంట్ సరఫరా చేయాలని సూచించారు. ఈమేరకు ప్రస్తుతం కరెంట్ కనెక్షన్ తీసేసిన ఇళ్లు, క్వార్టర్లకు వెంటనే సింగరేణి విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించాలని జీఎం మనోహర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. నాయకులు మునిమంద రమేశ్, దావ రమేశ్, ఎం.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



జీఎంతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: జనగాం జిల్లాలో న్యాయవాద దంపతులు అమృతరావు-కవితలపై పోలీసుల దాడికి నిరసనగా మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల దాడికి నిరసనగా శుక్రవారం విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, శ్రీధర్,భూమరెడ్డి, కారుకూరి సురేందర్, నరెందుల సురేందర్, సత్తన్న, సత్యనారాయణ, నళినికాంత్, రవీందర్, పద్మ, అబ్జలొద్దీన్, ప్రదీప్, షఫీక్, తిరుపతిస్వామి, తాజొద్దీన్, సదాశివ, సునీల్, వినీత, ఆనంద్‌బాబు ఉన్నారు.



బహిష్కరిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: న్యాయవాదులపై పోలీసుల దాడికి నిరసనగా ఈ నెల 8, 9 తేదీల్లో విధులు బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్ తెలిపారు. దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీసీపీ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గంగయ్య, మురళీకృష్ణ, గురువయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పరిహారం అందజేత

లక్సెట్టిపేట: ఈనెల 4న హాజీపూర్ మండలం టీకన్నపల్లిలో లేగదూడను చిరుతపులి దాడిలో మృతిచెందింది. ఫారెస్టు అధికారులు రూ.12 వేల నష్ట పరిహారం చెక్కును డివిజన్ అధికారి సర్వేశ్వర్‌తో బాధితుడు చాకపల్లి రమేశ్‌కి అందించారు. ఎఫ్ఆర్వో సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తా

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం సాయంత్రం పులిమడుగు గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామ శివారులోని వాగుపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరగా మంత్రి సీతక్క దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ శశిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

జైపూర్: గ్రామాల అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలోని టేకుమట్ల, ఇందారం, రామారావుపేట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత ఇందారం, టేకుమట్ల, రామారావుపేట ప్రభుత్వ పాఠశాలల వద్ద అధికారులు, నాయకులతో కలసి మొక్కలు నాటారు. ఈ మేరకు పలు సమస్యలపై ప్రజలు పలు వినతిపత్రాలు అందించారు. జెడ్పీసీఈవో, మండల ప్రత్యేక అధికారి గణపతి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్ రావు, పీఆర్ఏఈ రాజ్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, జిల్లా నాయకుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఎమ్మెల్యేను కలిసిన ఎస్టీపీపీ జీఎం

జైపూర్: ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని పవర్ ప్లాంటు జీఎం(ఈఅండ్ఎం)గా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌రావు గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. జీఎంతో సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, అధికారులు ప్రభాకర్‌రావు, మదన్‌మోహన్ ఉన్నారు.



మందమర్రిరూరల్: వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

వంతెన నిర్మాణానికి కృషి

మందమర్రిరూరల్: అందుగులపేట పంచాయతీ పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం ఆయన పెద్దవాగును పరిశీలించారు. వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరుకు కృషి చేస్తానన్నారు. వంతెన ఏర్పాటైతే వాగు అవతల వందల ఎకరాల పంట భూములు సాగుకు ఉపయోగపడుతాయన్నారు. గ్రామంలో పలు చోట్ల మొక్కలు నాటారు. జీవన్‌కుమార్, తిరుపతి రెడ్డి, రాజయ్య, సదానందం ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

జీఎంకి సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా జీఎంగా పనిచేసి బదిలీపై కొత్తగూడెం ఎన్విరాల్‌మెంట్ జీఎంగా వెళ్తున్న మనోహర్‌ను గురువారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి మల్లేశ్, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, దాసరి తిరుపతిగౌడ్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సురేష్, రంజిత్ కుమార్, లింగమూర్తి ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న గని అధికారులకు..

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పనిచేసి బదిలీపై వెళ్తున్న పిట్ ఇంజనీర్ రాంబాబు, ఇంజనీర్ సైదులును సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు, కార్మికులు రమేశ్, నగవర్ధన్, హరీష్, లింగాల కిరణ్, అశోక్, ఎం.రమేశ్, పూర్ణచందర్, రాజలింగు, ప్రశాంత్, వినోద్ పాల్గొన్నారు.

డీఐఈవో అంజయ్యకు..

మంచిర్యాలఅర్బన్: నూతన బాధ్యతలు చేపట్టిన డీఐఈవో అంజయ్యని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ తరపున గురువారం సన్మానించారు. అధ్యక్షుడు ప్రసాద్, జనరల్ సెక్రటరీ సందీప్, కోశాధికారి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి అధికారికి..

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ 3 గని మేనేజర్ సంతోష్ కుమార్ పదోన్నతిపై ఆర్జీ 2 ఏరియాకు రక్షణ అధికారిగా వెళ్తున్న సందర్భంగా ఆయన్ను ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ గురువారం సన్మానించారు. ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్: ఆర్కే 7 గని మేనేజర్‌గా పనిచేసి ఏజెంట్‌గా పదోన్నతి పొందిన డీజీఎం శ్రీధర్‌ను గురువారం నాయకులు, కార్మికులు సన్మానించారు. ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, నాయకులు గరిగే స్వామి, రాజు, లాగల శ్రీనివాస్, భూపతి అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా వెంకటేశం

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా కాగజ్‌నగర్‌కు చెందిన గోలెం వెంకటేశం నియమితులయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఎంపీ నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్‌పోటీలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గర్మిళ్ల ఉన్నత పాఠశాలలో ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా, ప్రథమ బహుమతిని జెడ్పీఎస్ఎస్ లక్సెట్టిపేట్ బాలికల విద్యార్థులు గెలుపొందగా, ద్వితీయ బహుమతిని పాతమంచిర్యాల, గర్మిళ్ల హైస్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారని నిర్వాహకులు తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. దిశ సీపీఎం నీలిమ, దిశ సీహెచ్‌వో రాజేశ్, సంతోశ్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ కె.నరేందర్ రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, సతీశ్, అన్నపూర్ణ, కిషన్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

బెల్లంపల్లి: సిద్దిపేటలో ఈనెల 17-19 తేదీల్లో జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఉంటాయని జిల్లా అధ్యక్షుడు ఆర్.చరణ్ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ వసతి గృహం ఆవరణలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మనోహర్, స్వామి, అనిల్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాతో బీమా సౌకర్యం

శ్రీరాంపూర్: ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్ ఖాతా ఉన్న సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు శ్రీరాంపూర్ బ్రాంచి మేనేజర్ అన్వర్ తెలిపారు. గురువారం ఆర్కే 6 గనిపై సమావేశం నిర్వహించి ప్రమాద బీమాపై అవగాహన కల్పించారు. గని మేనేజర్ తిరుపతి, సంక్షేమ అధికారి సునీల్ కుమార్, బ్యాంక్ ఫీల్డ్ అధికారి శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ పోస్టర్‌ను జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి గురువారం స్థానిక ఐబీ ఆవరణలో ఆవిష్కరించారు. నాయకులు వెంకటేశ్, శంకర్, తిరుపతి, జంగు, బాపు, శ్రీనివాస్, శంకరయ్య రాజయ్య పాల్గొన్నారు.

24న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక షెడ్యూల్‌ని సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. 24న ఎన్నిక, 16న నామినేషన్, 18న నామినేషన్ ఉపసంహరణ ఉంటుందని అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా పోటీలో పాల్గొనేవారు ఐదేళ్ల నుంచి మహాసభ జీవిత కాలసభ్యుడి సభ్యత్వం కలిగి ఉండాలని పేర్కొన్నారు. మంచిర్యాల రెవెన్యూ డివిజన్‌కు చెందిన వారై ఉండాలని, నామినేషన్ ఫీజు రూ.5 వేలు చెల్లించాలని సూచించారు.

పొలంబాట పట్టిన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని లోటస్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు గురువారం పొలం బాట పట్టారు. పర్యావరణం, వ్యవసాయం అనే ప్రాజెక్టులో భాగంగా బట్వాన్‌పల్లి శివారు ప్రాంతంలోని పంట పొలాలు, డ్రాగన్‌ఫ్రూట్ తోటను సందర్శించారు.

పాత కార్మికులతోనే పనులు చేయించాలి

మందమర్రిరూరల్: ఏరియాలోని వర్క్‌షాపు, స్టోర్, ఎస్అండ్‌పీసీ కార్యాలయాల్లో ఉన్న 9 మంది మహిళా కాంట్రాక్ట్ కార్మికులతో పనిచేయించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం డీజీఎం (సివిల్) శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ వారికి పనులు చెప్పడం లేదని, వారితోనే పని చేయించాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మల్లయ్య, ప్రభాకర్, శర్మ, లింగయ్య ఉన్నారు.

నూతన మార్కెట్ కార్యాలయం ప్రారంభం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంచిర్యాల మార్కెట్ కమిటీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గురువారం ప్రారంభించారు. గతంలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పయ్యావుల పద్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి సుధాకర్, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు